
# సత్యవాక్కు

సంపుటి - 42 మార్చి - 2021 సంచిక - 8



MAR '21

## క్రైస్తవ మాసపత్రిక

మార్చి - 2021

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| బుధవారం సాయంత్రం | : | 6.30 ని॥లకు రక్షణ ఛానల్‌లో |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 ని॥లకు రక్షణ ఛానల్‌లో |
| శుక్రవారం ఉదయం | : | 6.30 ని॥లకు MAHAA NEWS ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | లక్ష్మీ గూటం |
| | | రోషి గూటం |

**Youtube లో satyavanicoc. kkd లో**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


SATYA VANI

P.O. BOX. 80, KAKINADA

PIN : 533004. ph : 0884 - 2363722

98489 98547, www.satyavanivcoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 42　　మార్చి - 2021　　సంచిక -8

## నిత్య వాక్యము

ఇంచుమించు రెండువేల సంవత్సరముల క్రితము "ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు" అని యేసుప్రభువు పలికెను. యేసు ప్రభువు నిత్యుడు, ఆయన మాటలు నిత్యమైనవి. మనము చెప్పుమాటలు మనలోని భావములను వ్యక్తపరచే గురుతులు. దేవునిమాటలు దేవుని మనస్సును మానవుల భాషలో వ్యక్త పరచును. గనుక దేవుని చిత్తమును మానవులెరుగువలెనంటే దేవుని వాక్యమును వారు చదువవలెను. దాని ననుసరించవలెను. లిఖింపబడి యున్న దేవుని వాక్యమును నిర్లక్ష్యము చేయుటయే నేటి లోకము చేయుచున్న గొప్ప పాపమువలె కన్పించుచున్నది. దేవుని వాక్యము అతిశక్తివంతమైనది.

ఈ ప్రపంచములు దేవుని వాక్యమువలన నిర్మాణమైనవి. నేనెవరను? ఎక్కడకు వెళ్లుచున్నాను? అను ప్రశ్నలను మనలో మనం తరచు అడుగుచుందుము. వేలకొలది సంవత్సరముల నుండి ప్రజలు అడుగుచున్న ప్రశ్నలివి. వీటికి జవాబు లిచ్చుటకు మానవులు చేసిన ప్రయత్నములు అనేక గ్రంథాలయము లను నింపి యున్నవి. మన మే[illegible]గు

జీవించుచున్నామో శాస్త్రజ్ఞులు, వేదాంతులు చెప్పగలరు గాని ఎక్కడ నుండి వచ్చితిమో చెప్పలేరు. దేవుడొక్కడు మాత్రమే దానిని చెప్ప గలడు. సమస్తము ఎట్లు కలిగెనో బైబిలు ఒక్కటి మాత్రమే చెప్పుచున్నది. "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆది యందు దేవుని యొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ క[illegible]మ" (యోహాను 1:1-3). "యెహోవా వాక్కు చేత ఆకాశము లు కలిగెను. సముద్ర జలములను రాశిగా కూర్చువాడు ఆయనే. అగాధ జలములను కొట్లలో కూర్చువాడు ఆయనే. లోకులందరు యెహోవా యందు భయభక్తులు నిలుప వలెను. భూనివాసులందరు ఆయనకు వెరవ వలెను. ఆయన మాట సెలవియ్యగా దాని ప్రకారమాయెను. ఆయన ఆజ్ఞాపింపగానే కార్యము స్థిరపరచ బడెను" (కీర్తన 33:6-9). "ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు అందును బట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడ లేదనియు విశ్వాసము చేత గ్రహించు కొనుచున్నాము" (హెబ్రీ 11: 3). సమస్త ప్రాణులకు ఆధారభూతుడు ఆయనే. జీవము ఆయనచే ఉద్భవించెను.

ఈ విశ్వమంతయు అనాధారముగా గాక దేవుని వాక్యముపై ఆధారపడి చలించుచున్నది. దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. "ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను. ఆయన దేవుని మహిమయొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యుండి తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించు చున్నాడు" (హెబ్రీ 1:2,3). ఈ లోకము నంతటిని దేవుడు ఒకసారి గొప్ప జలప్రళయము ద్వారా నాశనము చేసెను (2పేతురు 3:-7, ఆది.6). అది అప్పుడు పాపముతో నిండి

యుండెను గనుక నాశనము చేయ బడెను. ఆయన రెండవసారి ఈ పాపపు లోకమును నాశనము చేయ బోవుచున్నాడు. అప్పుడాయన దానిని అగ్నితో నాశనము చేయును. “ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమై పోవును, భూమియు దాని మీదనున్న కృత్యములును కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమై పోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమైపోవు నట్టియు పంచభూతములు మహావేండ్ర ముతో కరిగిపోవునట్టియు దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు దానిని ఆశతో ఆపేక్షించుచుండవలెను” అని 2 పేతురు 3:10-12లో వ్రాయబడి యున్నది.

పాతనిబంధనలోని అద్భుతము లన్నియు దేవుని వాక్యము వలన జరిగెను. అద్భుతములు ప్రకృతి సంబంధముగా సహజమైనవికావు. అవి ప్రకృతికి మించినట్టివి. దేవుడు సర్వశక్తి మంతుడు. అనేకమందిని కొని పోవు జలాంతర్గాములను మానవుడు తయారు చేయగలిగిన యెడల ఒక మానవుని తన కడుపులో తీసికొనిపోవు పెద్దచేపను దేవుడు చేయగలడనుట సమంజసమే. వందలకొలది మైళ్ళ దూరములోనున్న వారితో మాటలాడు టకు మానవుడు టెలిఫోన్ కనిపెట్ట గల్గినయెడల ఈ విశ్వమంతటికీ కర్తయైన దేవుడు తన కిష్టము వచ్చిన రీతిగా మాటలాడ గలడనుట సమంజ సము కాదా? సంఖ్యా 20:7-13లో మోషే ఒక కఱ్ఱను దేవుని వాక్యమునకు గురుతుగా వినియోగించెను. యెహోషువా 10:12,13లో సమస్త ప్రకృతి దేవుని మాటకు లోబడునని యెహోషువా నిరూపించెను. దేవుడు ఈ విశ్వము నంతటిని ఆపుచేయ గలడా? అవును. ఆయన సూర్యుని నిలిపివేసెను. విశ్వాసములోయున్న శక్తి ఎంతగొప్పదో యేసు మత్తయి 17:20లో ఇట్లు వివరించెను [illegible]కు ఆవగింజంత విశ్వాసము[illegible]డల ఈ కొండను చూచి ఇక్క[illegible]ండి అక్కడికి పొమ్మనగానే అది పోవును;

మీకు అసాధ్యమైనది ఏమియు ఉండదు." అయితే ఈ విశ్వాసము దేవుని వాక్యమును వినుట ద్వారా కలుగును రోమా 10:17లో చెప్పబడి యున్నది.

దేవుని యొక్క వాక్యమే శరీరాన్ని ధరించి యేసుక్రీస్తాయెను. యేసుక్రీస్తు ద్వారా దేవుని వాక్యము మానవులకు ప్రత్యక్షపరచబడెను. యేసుప్రభువు ఈ లోకమందు జన్మించక ముందునుండే, ఆదినుండియే యుండెను. "ఎవ్వడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలు పరచెను" (యోహాను 1:18).

యేసు తాను చేసిన అద్భుతములను తన మాటలవలన చేసెను. అవన్నియును ఆయన వాక్ శక్తివలన జరిగించబడెను. ఆయన వేలకొలది ప్రజలకు అద్భుతముగా ఆహారము పెట్టెను (మత్తయి 14:19). గొప్ప తుఫానును అణచివేసెను (మత్తయి 8:26), రోగులను స్వస్థపరచెను (మత్తయి 8:3-8), చనిపోయిన వారిని లేవదీసెను (లూకా 7:14; యోహాను 11:43). ఆయన కుంటివానికి నడువ శక్తి నిచ్చెను, గ్రుడ్డివానికి చూపు నిచ్చెను, చెవిటివారికి వినుటకు శక్తి నిచ్చెను, దయ్యములను వెళ్ళగొట్టెను. ఇవన్నియును ఆయన మాటయొక్క శక్తినిబట్టి చేసెను.

దేవుని వాక్యమునందలి శక్తి వలన అపొస్తలులు అనేక అద్భుతములను చేసిరి. వారు శృంగారమను దేవాలయపు మంటపము దగ్గర ఒక కుంటివానిని బాగుచేసిరి (అపొ.కా. 3). లుద్దలో ఐనెయుయను పక్షవాయువు కలిగిన వానిని బాగు చేసిరి (అపొ.కా. 9:32,33). రోగులను బాగు చేసిరి. దయ్యములను వెళ్ళగొట్టిరి, చనిపోయిన వారిని లేవదీసిరి. ఇదంతయును దేవుని వాక్యమునందలి శక్తివలన వారు చేసిరి.

అయితే ఆ శక్తి ఇప్పుడు ఎక్కడ ఉన్నది? అది యిప్పుడుకూడా దేవుని వాక్యమునందే యున్నది. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి... రక్షణ

కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" అని రోమా 1:16లో అపో. పౌలు పలికెను. క్రైస్తవులుగా మార్పు జెందినవారి ప్రతిసందర్భములోను మొదట యేసుక్రీస్తు యొక్క సువార్త ప్రకటించబడెను. ఎందువలన? దానిని నమ్ము ప్రతివానికి అది రక్షణ కలుగ జేయుటకు దేవుని శక్తియైనందువలన.

ప్రాకృతిక ప్రపంచము దేవుని మాటకు ఎదురాడ లేదు. సమస్త ప్రకృతి ఆయనకు లోబడును. గాని మానవుడొక్కడు మాత్రమే ఎదురాడును. అయితే ఎదిరించువాడు తనమీదికి తానే శిక్ష తెచ్చుకొనును (రోమా 13:2). కావున మనము వినిన సంగతులను విడిచి పెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్తకలిగి యుండవలెను. ఎందుకనగా దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడి నందున ప్రతి అతిక్రమమునకును అవిధేయతయు న్యాయమైన ప్రతి ఫలము పొందియుండగా, ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించు కొందుము?" (హెబ్రీ 2:1-3). దేవుని వాక్యమును మనము ఎదురాడిన యెడల ఆయన ఆత్మను ఎదురాడినట్లే యగును (అపో.కా.7:51). ఆయన వాక్యమును నిరాకరించిన ప్రతివానికి ఆయన తీర్పుతీర్చును. "నన్ను నిరాకరించి నా మాటలను అంగీక రింపని వానికి తీర్పుతీర్చు వాడొకడు కలడు? నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" అని యేసుప్రభువు పలికెను (యోహాను 12:48).

యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, యేసుక్రీస్తు దేవుని కుమారుడని మనుష్యుల యెదుట ఒప్పుకొనుము, పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడుము బొందుము. అప్పుడు నీవు తీర్పులోనికి రాక జీవములో ప్రవేశింతువు. ఆయన మాటలకు అవిధేయత చూపువారిని ఆయన ప్రతి దండన చేయును సుమా!

# యేసుక్రీస్తు దేవుడా? కాదా?

యేసుక్రీస్తు దేవుడా? కాదా? యేసుక్రీస్తు దేవుడేనా? అని ప్రపంచం లో అనేకమంది ఆయనను గూర్చి అభిప్రాయపడుదురు. చాలామంది ఆయనను రక్షకునిగా నమ్ముతారు. ప్రభువుగా నమ్ముతారు. దేవుని కుమారునిగా నమ్ముతారు. కానీ ఆయనను దేవునిగా ఎందుకు నమ్మడం లేదు? ఆ దినాలలో యూదులు నమ్మలేదు, నేడు క్రైస్తవ్యంలో కొందరు ముఖ్యంగా యెహోవాసాక్షులు, క్రైస్తవేతరులలో కొందరు ముఖ్యంగా ఇస్లాంలో కొందరు ఆయనను దేవునిగా నమ్ముటలేదు. కానీ బైబిలు మాత్రము ఆయనను దేవుడు అని చెబుతుంది.

బైబిలు ఏమి చెబుతుందో ముందుగా తెలుసుకుందాం.

1. సృష్టికర్తయై ఉండవలెను.
2. సర్వశక్తిమంతుడై ఉండవలెను.
3. సర్వజ్ఞానియై ఉండవలెను.
4. సర్వాంతర్యామియై ఉండవలెను.
5. జీవన ప్రధాతయై ఉండవలెను.
6. ప్రేమామయుడై ఉండవలెను.
7. పాపములేనివాడై ఉండవలెను.
8. పరిశుద్ధుడై ఉండవలెను.

దేవుని గుణలక్షణములన్నీ మనము చదివినట్లయితే ఇవన్నియు కూడా యేసుక్రీస్తు ప్రభువులో మాత్రమే చూడగలము. నేను దేవుడను అనే కచ్చితమైన మాట యేసుక్రీస్తు చెప్పి నట్లుగా బైబిలులో వ్రాయబడలేదు. అలాగనీ ఆయన దేవుడను కాననీ చెప్పినట్లు కాదు. వీటన్నింటికీ సమాధానము ఒక్కటే దేవుని వాక్యమే.

యోహాను 1:1-3 లేఖన భాగములను మనము చదివినపుడు ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను.

సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు. ఆదియందు అనగా సృష్టి కంటే ముందుగా ప్రారంభంలోనే మొట్ట మొదటగా వాక్యము ఉండెను. ఆ వాక్యము ఎక్కడ ఉండెను? దేవుని దగ్గర ఉండెను. యోహాను 1:14

ప్రకారం ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను.

వాక్యమైయున్న ఆయనే యేసు క్రీస్తు. ఆయనే సృష్టికర్త. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగ లేదు. గనుక యేసుక్రీస్తు దేవుడే.

రోమా 9:5 ప్రకారం ఈయన సర్వాధికారియైన దేవుడై యుండి నిరంతరము స్తోత్రార్హుడై యున్నాడు.

యోహాను 10: 30 వచనములో యేసు పలికిన మాటలను చదివినపుడు నేనును తండ్రియును ఏకమైయున్నామనీ యూదులతో చెప్పెను. ఆయన స్పందనను గనుక మనము గమనించినట్లయితే...ఆయన దేవుడననీ చెబుతున్నట్లుగా కనిపిస్తూ ఉంది. ఈ కారణంచేతనే యూదులు ఆయనను రాళ్ళతో కొట్టుటకు సిద్ధమయ్యారు.

యోహాను 10:33 ప్రకారం అందుకు యూదులు. నీవు మనుష్యుడవై యుండి దేవుడనని చెప్పుకొనుచున్నావు గనుక దేవదూషణ చేసినందుకే నిన్ను రాళ్ళతో కొట్టుదుము గానీ మంచి క్రియ చేసినందుకు కాదనీ ఆయనతో చెప్పిరి. యేసు ఏమి చెబుతున్నారో యూదులు కచ్చితంగా అర్థం చేసుకున్నారు. తాను దేవుడననీ దేవునిగా ఆయన చెప్పుకొనుటను ఆయన విస్మరించలేదు. నేనును తండ్రియును ఏకమైయున్నామనీ ఆయన చెప్పినపుడు ఆయన మరియు తండ్రీ ఇద్దరూ ఒకే స్వభావము. ఒకే మూలాలను కలిగియున్నారనీ అర్థము.

యేసు యూదులతో తన మాటల భావనను వారికి అర్థమయ్యేటట్లుగా చెబుతూ... నువ్వు ఎప్పుడైతే కుమారుని ముద్దు పెట్టుకొనవో అప్పుడే దేవున్ని నెట్టేసే బ్యాచ్ అని వారితో అంటున్నాడు. ఇప్పుడు కూడా కొంత మంది అలాగే తయ్యారయ్యారనీ చెప్పవచ్చు. కొంతమంది యేసుక్రీస్తునే నెట్టేస్తున్నాం గానీ, తండ్రిని నెట్టడం లేదని అంటున్నారు. అంటే క్రీస్తుని నెట్టేస్తే... తండ్రిని నెట్టేసినట్లే. తండ్రిని ఘనపరచనట్లే, తండ్రిని ఆ[illegible]నట్లే అని మనం గమనించాలి.

బైబిలు : దేవుడు ఒక్కడే అని

చెప్పిందంటే... అది కరెక్టు.

తండ్రి దేవుడు అని చెప్పిందంటే ... అది కరెక్టు

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు దేవుడు అని చెప్పిందంటే అది కరెక్టు.

పరిశుద్ధాత్ముడు దేవుడు అని చెప్పిందంటే... అది కరెక్టు.

బైబిలు అవును అంటే అవును, కాదంటే కాదు.

**లేఖనములను పరిశోధించాలి.**

దానిని మనం అర్థం చేసుకోవాలంటే, సవివరంగా తెలుసుకోవాలంటే బైబిలు లేఖనాలను పరిశోధించాలి.

యోహాను 8:8 వచనములో యేసు అబ్రాహాము పుట్టక మునుపే నేను ఉన్నాననీ మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. ఈ మాటలు విన్న యూదులు యొక్క స్పందన ఏమనగా ఆయన ధేవదూషణ చేయుచున్నాడనీ, మోషే-ధర్మశాస్త్రం ప్రకారము (లేవీ 24:1). ఆతునను చంపుటకు రాళ్ళు తీసుకొనబోయారు. యోహాను 1:1, హెబ్రీయులకు 1:3 లేఖనముల ప్రకారం యేసుక్రీస్తు దేవుడే. అపొ.కా. 20:28 ప్రకారం. దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘంను కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులునుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చి జాగ్రత్తగా ఉండుడి.

సంఘంమును, దేవుని సంఘమును తన స్వరక్తమిచ్చి కొన్నది ఎవరు? యేసుక్రీస్తు - దేవుడే. యోహాను 20:28 వచనంలో శిష్యుడైన తోమా-యేసుక్రీస్తు గూర్చి చెప్పారు. అందుకు తోమా ఆయనతో నా ప్రభువా, నా దేవా అనెనను. అలా పిలిచినపుడు యేసు తోమాను సరి చేయలేదు. తీతుకు 2:13 లేఖనాల ప్రకారం అనగా మహాదేవుడును మన రక్షకుడునైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురు చూచుచు ఈ లోకంలో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రతుకు చుండ వలెనని మనకు బోధించుచున్నది.

(యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురు చూడాలని ప్రోత్సహిస్తుంది).

యేసుక్రీస్తు యొక్క మిత్రులు

నయితము ఆయన దేవుడని ఒప్పుకున్నారు.

1. నజరేయుడైన యేసు దేవుడని బాప్తీస్మమిచ్చు యోహాను ఒప్పుకొనెను యోహాను 1:29,34.
2. యేసేక్రీస్తని దేవుడని అపో. పేతురు ఉద్ఘాటించెను మత్తయి 16:16.
3. దమస్కు మార్గములో అపో.పౌలు యేసుదేవుడని ఉద్ఘాటించెను అపో.కా. 22: 6-10.

తరువాత కూడా ఆయన దేవుడని ప్రకటించెను ఫిలిప్పీ 2:-5-11.

4. అపో. యోహాను తాను దేవుడనని యేసు చెప్పుకొనిన మాటలను వ్రాసెను ప్రకటన 1:8.
5. యేసేక్రీస్తని దేవుడని దేవదూతలు ప్రకటించిరి లూకా 2:10-11.
6. తండ్రియైన దేవుడు యేసు దేవుని కుమారుడని ప్రకటించెను మత్తయి 3:17, 17:5.

హెబ్రీయులకు 1:8 లేఖనాల ప్రకారంగా యేసును గూర్చి తండ్రి మాట్లాడుతూ దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచునది.

నీ రాజదండము న్యాయార్థ మయినది అని అన్నారు.

తండ్రి యేసును దేవా అని సంబోధించడం యేసుక్రీస్తు నిజముగా దేవుడేనని సూచిస్తుంది.

ప్రకటన గ్రంథంలో దూత అపొస్తలుడైన యోహానును దేవుని మాత్రమే ఆరాధించమని ఉపదేశించెను.

ప్రకటన 19:10 లేఖనాల ప్రకారం అందుకు నేను అతనికి నమస్కారము చేయుటకై అతని పాదముల యెదుట సాగిలపడగా అతడు వద్దు సుమీ. నేను నీతోను యేసును గూర్చిన సాక్ష్యము చెప్పు నీ సహోదరులతోను సహదాసుడను దేవునికే నమస్కారము చేయుము. యేసును గూర్చిన సాక్ష్యము ప్రవచన సారమని నాతో చెప్పెను.

**యేసు ఆరాధనీయుడు**

లేఖనములో పలుమార్లు యేసు ఆరాధనను అందుకున్నారు. మత్తయి 2:11, మత్తయి 14:33, మత్తయి 28:9, లూకా 24:52, యోహాను 9:38

ఆయనను ఆరాధించినందుకు ఎప్పుడు ప్రజలను ఆయన గద్దింప

లేదు. యేసు ఒకవేళ దేవుడు కాకపోతే అయనను ఆరాధించవద్దని ప్రజలకు అంటే ప్రకటన గ్రంథంలో ఆ దూత చెప్పినట్లుగానే చెప్పేవాడు.

ఒకవేళ ఆయన దేవుడు కాక పోతే ఈ లోకపు పాపములను పరిహరించుటకు అయన చెల్లించిన క్రయధనము సరిపోయేది కాదు. 1 యోహాను 2:2 లేఖనాల ప్రకారం ఆయనే మన పాపములకు శాంతి కరమై యున్నాడు సృష్టించబడిన వ్యక్తి అంటే యేసు ఒకవేళ దేవుడు కాకుంటే మానవుడు అయి ఉంటాడు. అనంత మైన దేవునికి పాపమును బట్టి చెల్లించ వలసిన అనంతమైన క్రయధనమును మానవుడు చెల్లించలేడు. దేవుడు మాత్రమే లోకపు పాపములను మోసికొనగలడు.

2 కొరింథీ 5:21 ప్రకారం ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను. యేసుక్రీస్తు మరణించి, సమాధి చేయబడి పునరుత్థానుడై తిరిగి లేచి పాపముపై, మరణం పై యేసు క్రీస్తు తన విజయాన్ని నిరూపించారు.

**- ఎమ్. సత్యనారాయణ.**

## బైబిలు నిబంధనలు

ఈ అంశము చాల ప్రాముఖ్యము, అయినను తరచు నిర్లక్ష్యము చేయ బడునట్టిది. క్రైస్తవలోకంలో యున్న వివిధ నమ్మకములకు కారణం నిబంధ నలను అపార్థము చేసికొనుట వలన కలిగెను. బైబిలు అంతయు దేవుని వాక్యము గనుక దానికంతటికీ మనం విధేయత చూపాలని అనేకులు తలం తురు. గాని నిజానికి ఎవడును దాని కంతటికని విధేయత చూపుటకు ప్రయత్నించడు. పాతనిబంధనలో వివిధ జంతుబలులు ఆజ్ఞాపింప బడెను. అయినను దేవుని ఆరాధనలో నేడు జంతుబలుల నర్పించుటకు ఎవడును ప్రయత్నించడు. గనుక బైబిలు నిబంధనల అంశమును మనము క్షుణ్ణంగా తెలిసికొనాలి.

నిబంధన అనగా నేమి ?

మొదటిగా నిబంధన

యేమిటో మనం తెలిసికొనాలి. సింపుల్‌గా చెప్పాలంటే అదొక ఒడంబడిక. రెండు పక్షముల మధ్య ఏర్పడిన ఒడంబడిక అది. ఆ నిబంధనను అంతము వరకు నెరవేర్చడానికి ఇరుపక్షముల వారికి వివిధ బాధ్యతలుంటాయి. పూర్వకాలములో రెండు రకములైన నిబంధనలుండేవి. ఒకటి రెండు సమాన పక్షముల మధ్య కుదిరిన ఒడంబడిక, ఇద్దరు సమఉజ్జీల మధ్య కలిగిన ఒప్పందము. వారు తర్జనభర్జన చేసి, బేరసారాలు జరిపించి చివరకు ఇద్దరు ఒప్పుకొని అంగీకారము తెలియజేయుదురు. యిది సాధారణంగా దేశముల మధ్య జరిగే ఒడంబడిక.

రెండవది ఒక బలమైన పక్షము బలహీన పక్షముతో కుదుర్చుకొనిన ఒప్పందము. యుద్ధములో విజయము సాధించిన వారు ఓడిపోయిన వారితో చేసికొనే ఒడంబడిక. అందులో బలమైనవారు ఓడిపోయిన వారి నుండి కొన్ని షరతులు కోరుదురు. కొన్ని సంగతులలో వారు రాజీపడవలెను. విజయం సాధించిన వారు కొన్ని వాగ్దానములు చేతురు. బలహీనులు వాటికి లోబడాలి. లేదా దాని పర్యవసానముల నెదుర్కొనాలి. దేవుడు మానవులతో చేసిన నిబంధనలు ఇట్టివే. దేవునితో బేరసారములాడుటకు మానవునికి ఎవ్విధమైన హక్కు కూడ లేదు. యేమీ కోరుకోడానికి హక్కు లేదు. ఏలయనగా ఆయన సృష్టికర్త.

ఈ నిబంధనలు సాధారణంగా ఒట్టుపెట్టుకొనుట ద్వారా అమలులోనికి వచ్చును. మరియు సాక్షుల యెదుట ఈ నిబంధనలు జరుగును. దాని జ్ఞాపకార్థము ఏదోకటి ప్రతిష్ఠించుట ద్వారా యిట్టి నిబంధనలు అమలు చేయబడును. లేదా ఒకరి కొకరు బహుమతుల నిచ్చుకొనుట జరుగును. ఈ నిబంధనల తీవ్ర ప్రాముఖ్యతను యిది తెలియజేయును. నిబంధన చేయబడిన తరువాత తీవ్ర పరిణామములు లేకుండా అది ఉల్లంఘించబడదు. నిబంధన యొక్క ప్రాముఖ్యతను గలతీ 3:1లో పౌలు ఇట్లు చెప్పాడు: "సహోదరులారా, మనుష్యరీతిగా మాట్లాడుచున్నాను; మనుష్యుడు చేసిన ఒడంబడికయైనను

స్థిరపడిన తరువాత ఎవడును దానిని కొట్టివేయడు, దానితో మరేమియు కలుపడు".

మనుష్యులు చేసిన ఒడంబడికయే అంత పట్టు కలిగియున్న యెడల దేవునితో చేయబడిన ఒడంబడిక మరి ఎంత బలము కలిగి యుంటాది? ఈ నిబంధన ఎవరితో చేయబడెనో వారికే అది వర్తించునని తెలిసికొనుట ముఖ్యము. ఒక మనుష్యునితో నేను ఏదైనా ఒప్పందము చేసికొంటే అది అతనికిని నాకును మధ్య మాత్రమే యుండును. అది మరొకని కెవనికిని వర్తింపదు. బైబిలు నిబంధనల విషయములో కూడా అదే సూత్రము వర్తించును. తదుపరి పాఠములలో ఈ ప్రాముఖ్య సంగతిని జ్ఞాపకముంచు కొనుట అత్యవసరము.

## దేవుడు చేసిన వేర్వేరు నిబంధనలు

ఇంతకు ముందే చెప్పుకొన్నట్లుగా దేవుడు వివిధ మనుష్యులతో వివిధములైన నిబంధనలు చేసారు. మొదటి నిబంధన ఆయన ఆదాముతో చేసారు. దేవుడొక వనమును సృష్టించి ఆదామును హవ్వను అందులో యుంచారు. వారికి కావలసిన సమస్తమును దేవుడిచ్చారు. అది భూమి పై పరదైసువంటిదే. వారు నిత్యము జీవించెదరని దేవుడు వాగ్దానము చేసారు. గాని ఒక షరతు విధించారు. వారు మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలమును మాత్రము తినరాదు. అయితే ఆదాము హవ్వలు నిషేధింపబడిన ఫలమును తిన్నారు. నిబంధన నుల్లంఘించారు. ఆ వనము నుండి తోలివేయబడ్డారు. తత్ఫలితముగా పాపము చేసిన వారయ్యారు.

రెండవది దేవుడు నోవహుతో నిబంధన చేసారు. ఈ లోకము నంతటిని జలప్రళయముతో ఘరెన్నడు నాశనము చేయనని దేవుడు వాగ్దానము చేసారు. ఆ నిబంధనకు గురుతుగా ఆయన ఆకాశము మేఘములో తన (ఇంద్ర) ధనస్సు నుంచారు. (ఆది.కా. 9:9-17). నోవహు ఫలించి అభివృద్ధి పొంది భూమిని నింపించాలని ఆ నిబంధనలో భాగమై యుండెను (ఆది.కా. 8:17). దేవుడు మరొక నిబంధనను దావీదుతో చేసారు. 2 సమూయేలు 7వ అధ్యాయములో దేవుడు దావీదుకు ఇట్లు వాగ్దానము చేసారు. "నీ దినములు సంపూర్ణములగునప్పుడు నీవు నీ పితరులతో కూడ నిద్రించిన తరువాత నీ గర్భములో

నుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి, రాజ్యమును అతనికి స్థిరపరచెదను... నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును. నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడు ననెను" (2సమూ 7:12,16). దేవుడు చేసిన ఈ వాగ్దానమును దావీదు నిబంధన యని చెప్పియున్నాడు (2 సమూ 23:5). మరల కీర్తన 132:12 లో ఈ నిబంధనను గూర్చి చెప్పబడి నది. "నీ కుమారులు నా నిబంధనను గైకొనిన యెడల నేను వారికి బోధించు నా శాసనమును వారు అనుసరించిన యెడల వారి కుమారులు కూడ నీ సింహాసనము మీద కూర్చుందురని యెహోవా సత్యప్రమాణము దావీదుతో చేసెను" (కీర్తన 132:11,12). దావీదు యొక్క వారసుడు అతని సింహాసనముపై నిత్యము వుండునని దేవుడు ఇక్కడ చెప్పుట చూడగలము.

దేవుడు అబ్రాహాముతో కూడ నిబంధన చేసెను. దీనిని గూర్చి ముఖ్యముగా ఆదికాండము 12:1-3 లో చదువగలము. "అబ్రాహాము తొంబది తొమ్మిది యేండ్ల వాడైనప్పుడు యెహోవా అతనికి ప్రత్యక్షమై నేను సర్వశక్తిగల దేవుడను, నా సన్నిధిలో నడుచుచు నిందారహితుడవై యుండుము. నాకును నీకును మధ్య నా నిబంధనను నియమించి నిన్ను అత్యధికముగా అభివృద్ధి పొందించెద నని అతనితో చెప్పెను" (ఆది.కా. 17: 1-3). మరల 12:1-3లో "యెహోవా నీవు లేచి నీ దేశము నుండియు నీ బంధువుల యొద్ద నుండియు లేచి నీ తండ్రి యింటి నుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము. నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును; నీవు ఆశీర్వాదముగా యుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను. నిన్ను దూషించిన వానిని శపించెదను. భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వ దింపబడుననెను".

అబ్రాహాము పక్షమున ఈ దేవుని నిబంధనలో నాలుగు ముఖ్య వాగ్దానములున్నవి. అబ్రాహాము ఒక గొప్ప జనాంగముకు తండ్రి యగును. ఈ జనాంగము నివసించు టకు ఒక దేశముండును. అతని నాశీర్వదించు టకు దేవుడు వాగ్దానము చేసెను. మరియు అబ్రాహాము ద్వారా ఈ

లోకములోని జనాంగములన్నియు ఆశీర్వదించబడును. ఈ అఖరి వాగ్దానము ఆత్మీయమైనది. దాని ముందున్న మూడు భౌతికమైన దీవెనలు. ఈ ఆత్మీయ వాగ్దానము పరోక్షముగా యేసుక్రీస్తును గూర్చి ఉద్దేశించినది. ఆయన వచ్చి ఈ లోకము నంతటికి పాపములనుండి రక్షణను గ్రహించును. అది ఇశ్రాయేలీయులకే, అబ్రాహాము సంతతికే కాదు గాని ప్రజలందరికీ.

**మోషే ద్వారా నిబంధన చేసెను**

తరువాత అబ్రాహాము సంతతి వారు ఐగుప్తులోని బానిసత్వమును వీడిన తరువాత, దేవుడు వారిని సీనాయి కొండకు నడిపించి, వారితో మోషే ద్వారా ఒక నిబంధనను చేసెను.

"మోషే దేవుని యొద్దకు ఎక్కి పోగా యెహోవా ఆ పర్వతము నుండి అతని పిలిచి – నీవు యాకోబు కుటుంబీకులతో ముచ్చటించి ఇశ్రాయేలీయులకు తెలుపవలసిన దేమనగా – నేను ఐగుప్తీయులకు ఏమి చేసితినో, మిమ్మును గద్ద రెక్కల మీద మోసి నా యొద్దకు మిమ్మునెట్లు చేర్చు కొంటినో మీరు చూచితిరి. కాగా నా మాట శ్రద్ధగా విని నా నిబంధననుసరించి నడిచిన యెడల మీరు సమస్త దేశములలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్త భూమియు నాదే గదా. మీరు నాకు యాజక రూపమైన రాజ్యము గాను పరిశుద్ధమైన జనము గాను ఉందురని చెప్పుము; నీవు ఇశ్రాయేలీయులతో పలుక వలసిన మాటలు ఇవే" యని చెప్పెను (నిర్గమ 19:3-6). ఈ నిబంధనలో పది యాజ్ఞలు కూడ ఇమిడియున్నవి. "అతడు నలుబది రేయింబవళ్ళు యెహోవాతో కూడ అక్కడ ఉండెను. అతడు భోజనము చేయలేదు, నీళ్ళు త్రాగలేదు. అంతలో ఆయన ఆ నిబంధన వాక్యములను అనగా పది ఆజ్ఞలను ఆ పలక మీద వ్రాసెను" (నిర్గమ 34:28).

దేవుడు తన ఆఖరి నిబంధనను మానవులందరితో చేసాడు. అది యేసు క్రీస్తు సిలువపై మరణించగా స్థాపించబడెను. ఈ ఆఖరి నిబంధనను గూర్చి ఈ పాఠములలో ముఖ్యముగా నేర్చు కొన బోవుచున్నాము. ఈ నిబంధనలను అర్థము చేసికొనుటలో ఉద్భవించిన గందరగోళము క్రైస్తవ లోకములో యున్న అనేక డినామినేషన్లకు చీలికలకు హేతువాయెను.

# దావీదు పాపము చేసినప్పుడు

బైబిలులో ప్రముఖముగ కనబడు వ్యక్తులలో దావీదు ఒకడు. అతడొక సింహాన్ని, ఎలుగుబంటిని, గొల్యాతును జయించాడు. రాజైన సౌలు అతనిని చంపవెదుకుచున్నప్పుడతడు తన విజ్ఞతను కోల్పోలేదు. అతడు రాజుగా యుండగా ప్రజలను ఆత్మీయస్థితికి నడిపించాడు.

అయినను దేవునికిష్టానుసారమైన మనుష్యుడు సయితము తన జీవితాన్ని పాడుచేసుకోగల్గును (అపో. కా. 13:22). దావీదు పాపము చేసాడు, జీవితాన్ని గజిబిజిచేసుకొన్నాడు. అతడు బాధ్యతా రహితముగా ప్రవర్తించాడు (2సమూ 11:1), అవివేకిగా ప్రవర్తించాడు (2 సమూ11:2-). తన వివేక విశిష్టతను కోల్పోయాడు (2సమూ 11:6-27). దావీదు పదియాజ్ఞలలో సగాన్ని ఉల్లంఘించాడు. అతడు వ్యభిచరించాడు (2సమూ 11:4). తన పొరుగువాని భార్యను ఆశించాడు (2సమూ 11:3). వేరొక మనుష్యుని భార్యను దొంగిలించాడు (2 సమూ 12:9). అబద్ధమాడాడు (2సమూ 11:7,8; 12,13). నరహత్యగావించాడు (2 సమూ 11:17, 12:9). దావీదు యొక్క పాపము ఘోరమైనది.

## దావీదుకు అవసరమైన సహాయం యేమిటి?

దావీదు తన పాపమును ఒప్పుకొనుటకు నిష్కల్మష మనుష్యుడు అతనికి అవసరము. తన పాపమును సమర్ధించేవాడు, తన మనసాక్షిని, ఆత్మను నిమ్మళించేవాడు అతనికి అవసరము లేదు, అతనికి సత్యము, సమాధానము అవసరమై యుండెను. ఆ మనుష్యుడు నాతాను (2సమూ 12:1-4). బ్రద్దలయ్యే హృదయం దావీదుకు అవసరం (కీర్తన 51:17). తనను స్వీకరించే హృదయం అతనికి అవసరం.

క్షమాపణ నిదర్శనము దావీదుకు అవసరమాయెను. మనందరి ప్రాధమిక సమస్య పాపము; గనుక మనందరి ప్రాముఖ్య అవసరం

క్షమాపణ (కీర్తన 32:1). అతని పాపములు క్షమించబడిన తరువాత తాను కొనసాగునట్లు శక్తి, బలము అతనికి అవసరము సంఘములోను, లోకములోను కూడ ఒకరినొకరు ప్రోత్సాహించుకొనుట అత్యవుసరము. ఈ ఆదరణ, క్షమాపణ లేనియెడల ఒకవేళ ఆ వ్యక్తి అత్యధికమైన దు:ఖము లో మునిగిపోవును (2కొరింథీ 2:7).

## దావీదు ప్రాముఖ్య పాఠములు నేర్చుకొన్నాడు

పాపము పట్టుబడునని దావీదు నేర్చుకొన్నాడు (సంఖ్యా 32:23). కోత కాలము తధ్యమని అతడు నేర్చుకొన్నాడు (గలతీ 6:7). ఎడబాటు ఖచ్చితమని కూడ అతడు నేర్చుకొన్నాడు (యెషయా 59:1).

## పాపము బయలుపడినప్పుడు దావీదు యేమి చేసాడు ?

దావీదు తన పాపమును ఒప్పుకొన్నాడు (2సమూ 12:13). తన పాపమును గూర్చి వ్యక్తిగత బాధ్యతను ఒప్పుకొన్నాడు. దావీదు దేవుని దగ్గరకు వెళ్లాడు (కీర్తన 51:4). గొప్పదేవుని యెదుట చిన్న, పెద్ద పాపములుండవు. దావీదు దేవుని యొద్ద క్షమాపణ కోరాడు (కీర్తన 51:1). అతడు విస్తార వచనములు పలుకకుండా "నేను పాపము చేసాను" అని సింపుల్‌గా ఒప్పేసుకొన్నాడు. దేవుడతని క్షమించారు.

## ముగింపు

నేను దేవునికి వ్యతిరేకముగా పాపము చేసాను అని దావీదు చెప్పాడు. ఈ మాటలలో సౌలురాజుకును, దావీదుకును గల వ్యత్యాసాన్ని మనం చూడగలము. మనం ఒప్పుకొనునప్పుడు దీర్ఘవచనములతో యుండరాదు. అది యదార్ధహృదయముతో యుండాలి. దావీదు ఒప్పుకొనిన రీతి మనందరికీ గొప్ప మాదిరి. నింద అంతయు తన మీదనే అతడు వేసుకొన్నాడు. అతని నేరమును అతడు సంక్షిప్తము చేయలేదు. తాను దేవునికి విరుద్ధముగా పాపము చేసితినని దావీదు గమనించాడు.

- మార్క్ పోసీ

# 119 వ దావీదు కీర్తన

బైబిలులో 119 వ కీర్తన చాల పొడవైన కీర్తన. బైబిలు అంతటిలో అది అతిపెద్ద అధ్యాయము కూడాను. ఆదిమ హెబ్రీభాషలో యున్న 22 అక్షర క్రమమును బట్టి ప్రతి 8 వచనములు వ్రాయబడి యున్నవి. అనగా మొదటి 8 వచనములలో ప్రతి వచనము హెబ్రీభాషలోని మొదటి అక్షరముతో ఆరంభమగును. అట్లే తదుపరి 8 వచనములు రెండవ అక్షరముతోను మిగతా అన్ని వచనములు మిగతా అక్షరములతోను వ్రాయబడినవి. యిది ఒక ఆశ్చర్యకరమైన సాహిత్యం. అంతేకాకుండా దానిలోని 176 వచనములలోను ధర్మశాస్త్రము, శాసనములు, మార్గములు, కట్టడలు, ఆజ్ఞలు, నియమములు మొ॥గు పదములు కనబడును.

దేవుని వాక్యము మనకు సంతోషము, హర్షకారణము : "నీ శాసనములను బట్టి నేను సంతోషించు చున్నాను" (14వ). "నీ కట్టడలను బట్టి నేను హర్షించెదను, నీ వాక్యమును నేను మరువక యుందును" (18వ). "నీ శాసనములు నాకు సంతోషకరములు, అవి నాకు ఆలోచన కర్తలై యున్నవి" (24వ). "వేలకొలది వెండి బంగారు నాణెములు కంటె నీ విచ్చిన ధర్మశాస్త్రము నాకు మేలు" (72 వ). "నీ ధర్మశాస్త్రము నాకెంతో ప్రియముగా నున్నది. దినమెల్ల నేను దానిని ధ్యానించుచున్నాను" (97వ).

దేవుని వాక్యము పాపము నుండి మనలను కాపాడును : "యౌవనస్థులు దేనిని బట్టి తమ నడత శుద్ధిపరచు కొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే గదా?(9వ). "నీ యెదుట నేను పాపము చేయుకుండునట్లు నా హృద యములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను" (11వ).

దేవుని వాక్యము నిత్యమైనది, స్థిరమైనది : "యెహోవా నీ వాక్యము ఆకాశమందు నిత్యము నిలకడగా

నున్నది" (89వ). "నీ నీతి శాశ్వత మైనది. నీ ధర్మశాస్త్రము కేవలము సత్యము" (142వ). "నీ శాసనములు శాశ్వతమైన నీతి గలవి. నేను బ్రదుకు నట్లు నాకు తెలివి దయచేయుము" (144వ). "నీ వాక్య సారాంశము సత్యము. నీవు నియమించిన న్యాయ విధులన్నియు నిత్యము నిలుచును" (160వ).

**దేవుని వాక్యము శ్రమలలో మనకు సహాయము చేయును :** "నీ వాక్యము నన్ను బ్రతికించి యున్నది. నా బాధలో ఇదేనాకు నెమ్మది కలిగించు చున్నది (50వ). "శ్రమ కలుగుక మునుపు నేను త్రోవవిడిచితి, ఇప్పుడు నీ వాక్యము ననుసరించి నడుచుకొను చున్నాను" (67వ).

**దేవుని వాక్యము తప్పు మార్గము నుండి మనలను కాపాడును :** "నీ ఉపదేశము వలన నాకు వివేకము కలిగెను. తప్పుమార్గములన్నియు నా కసహ్యములాయెను" (104వ). "నీ ఉపదేశములన్నియు యధార్థములని నేను వాటిని మన్నించుచున్నాను. అబద్ధ మార్గములన్నియు నాకసహ్యములు" (124వ).

**దేవుని వాక్యము మన సహవాసమును నిర్వచించును :** " నీ యందు భయభక్తులు గలవారందరికిని నీ ఉపదేశములననుసరించు వారందరికిని నేను చెలికాడను" (63వ). "నీయందు భయభక్తులు గల వారును, నీ శాసనములను తెలిసి కొనిన వారును నా పక్షమున నుందురు గాక (79వ).

**దేవుని వాక్యము మనలను క్షేమముగా నడిపించును :** "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగై యున్నది" (105వ). " నీ ధర్మశాస్త్రమును ప్రేమించు వారికి ఎంతో నెమ్మది కలదు. వారు తూలి తొట్రిల్లుటకు కారణమేమియు లేదు" (16వ).

– సీసెల్మే

# క్రీస్తు సంఘ పునరుద్ధరణ

క్రీస్తు సంఘ చరిత్ర అంతయు 4 భాగములుగ విభజింపవచ్చును. 1. క్రొత్తనిబంధన సంఘము కాలము 2. విశ్వాసభ్రష్టత్వములో యున్న కాలము 3. ప్రొటెస్టాంటు సవరణోద్యమ కాలము మరియు 4. పునరుద్ధరణ కాలము. ఈ పునరుద్ధరణ కాలమును కొంత ఇప్పుడు పరిశీలింతుము.

**పునరుద్ధరణ పతన కాలమును సూచించును :** విశ్వాస భ్రష్టత్వ కాలము అది. అంటే ఆదిమ మాదిరి నుండి తొలగి పడిపోయినట్టిది. అట్టి విశ్వాసభ్రష్టత్వము సంభవించునని క్రొత్త నిబంధన ముందుగనే తెలియ జేసియున్నది (1తిమో4:1-3; 2 పేతురు 2:1-3ను కూడ చదువుము). క్రొత్తనిబంధన చెప్పినట్లుగానే విశ్వాస భ్రష్టత్వము సంభవించినది. కొంత కాలానికి, ఆదిమ మాదిరి వైపు తిరుగుదము అనే విజ్ఞాపన మొదలైనది. క్రొత్త నిబంధనలో యున్న సంఘము వైపు తిరిగి మళ్లుదము అనే నినాదము ఆరంభించబడినది.

పునరుద్ధరనను గూర్చి మూడు సంగతులు గమనార్హము : 1. పునరుద్ధరణ సూత్రము 2. పునరుద్ధరణ విజ్ఞాపన 3. పునరుద్ధరణ ఉద్యమము అనునవి.

**పునరుద్ధరణ సూత్రమును** గ్రహించుట సులువే, ఎంతమట్టుకైతే భ్రష్టత్వము సంభవించునదో, అంత మట్టుకు సంఘము పునరుద్ధరించుట. ఆయా విషయాల్లో పునరుద్ధరణ జరుగుట ఆవశ్యము. మనుష్యులు సాధారణంగా పాడైపోయిన కారును బాగు చేయించుకొంటారు, ఇండ్లను, విరిగిపోయిన సామాగ్రిని బాగు చేయించుకొంటారు. ఆత్మసంబంధముగా పునరుద్ధరణ సూత్రము క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించుట జరగాలి. ఆరంభములో అదెట్లుండెనో అట్లే దాన్ని పునరుద్ధరించాలి. పునరుద్ధరణ విజ్ఞాపన పునరుద్ధరణ సూత్రమును వక్కాణించుచున్నది. "ఎవడైనను బోధించిన యెడల వాడు దైవోక్తులను బోధించునట్లు బోధింపవలెను" అని

పేతురు చెప్పినప్పుడు పునరుద్ధరణ విజ్ఞాపనను ప్రభోదించాడు (1 పేతురు 4:11).

పునరుద్ధరణ విజ్ఞాపనము ద్వారా పునరుద్ధరణ ఉద్యమము ఉద్భవించును. విశ్వాసభ్రష్టత్వము జరిగిన విషయాన్ని ప్రజలు గమనించు సరికి, దేవుని మార్గము తట్టు తిరుగుదు మని వారు నిశ్చయించు కొందురు. అట్టి సందర్భాల్లో ఈ ఉద్యమముకు నాంది పలుకబడును. ఆదిమ క్రమము నకు తిరిగి వెళ్లుటలో యున్న యదార్థ తను ప్రజలు గమనింతురు.

అట్టి ఉద్యమానికి బైబిలు గుర్తింపు నిచ్చుచున్నది. పూర్వము పాత నిబంధన కాలములో ప్రజలు దేవుని నుండి తొలగిపోయారు. అప్పుడు యెహోవా వారికి ఈలాగు సెలవిచ్చారు "మార్గములలో నిలిచి చూడుడి, పురాతన మార్గములను గూర్చి విచారించుడి. మేలు కలుగు మార్గమేది యని అడిగి అందులో నడుచుకొనుడి. అప్పుడు మీకు నెమ్మది కలుగును" (యిర్మియా 6:16). క్రొత్తనిబంధన క్రైస్తవులకు అదే హెచ్చరిక ఈనాడును వర్తించును.

పవిత్ర క్రొత్త నిబంధన క్రైస్తవ్యమును పునరుద్ధరించుటయే నేటి క్రీస్తు సంఘముల ధ్యేయము. "విత్తనము దేవుని వాక్యము" (లూకా 8:11). అది మొదటి శతాబ్దములో ఎట్టి ఫలముల నిచ్చెనో నేడును అదే ఫలములనిచ్చును. నాటి క్రైస్తవులు అప్పుడున్న ఒకే ఒక్క సంఘ సభ్యులైరి. అదే క్రీస్తుసంఘము. బైబిలు మాట్లాడు నది మేము మాట్లాడుదుము, బైబిలు మౌనియైన చోట మేము మౌనుల మగుదుము. బైబిలు సంగతులను బైబిలు పేర్లతోనే పిలుతుము. బైబిలు చెప్పునవే చేతుము.

మాకొక భూసంబంధమైన అధికారి లేదు, భూసంబంధ కార్యాల యములేదు. మానవ కల్పిత ప్రమాణ పుస్తకములు లేవు. క్రీస్తే మా విశ్వాస ప్రమాణము. బైబిలు ఒక్కటే మార్గదర్శి. బైబిలు నొద్దకు తిరిగివెళ్లుటకు మీరు మాతో కలసిరండియని అందరికీ విజ్ఞాపన చేయుచున్నాము. బైబిలు నొద్దకు, క్రీస్తునొద్దకు, బైబిలు బోధించు సంఘము నొద్దకు మరలుదము రండి!!

**హ్యూ ఫుల్‌ఫర్డ్**

# సంక్షిప్త వార్తలు

2021 ఫిబ్రవరి 14 వ తేదీ ఆదివారం నాడు పెద్దాపురం లెప్పర్ కోలనీలో క్రీస్తు పరిచర్యను నమ్మకముగా చేసిన సోదరుడు జొన్నకూటి జాన్ గారు ప్రభువు నందు నిద్రించిరి. తానే స్వయంగా ఆ వ్యాధి గ్రస్తుడైనను తన లాంటి అనేకులను క్రీస్తులోనికి ఆయన నడిపించిరి. రిక్కీగూటం గారి సహాయసహకారము వలన పెద్దాపురం లెప్పర్ కోలనీలో వారికొక ఆరాధన స్థలము, ఒక డిస్పెన్సరీ కూడ నిర్మించబడినది. అక్కడ క్రీస్తుపరిచర్యను జాన్ గారి కుమారుడు సుధాకర్ గారు చక్కగా కొనసాగించుచున్నారు. 18 వ తేదీ గురువారం అదే కాలనీలో జాన్ గారి స్మారక కూటము జరిగినది.

2021 ఫిబ్రవరి 18, 19 తేదీలలో నర్సీపట్నం ఏరియాలో యున్న క్రీస్తు సంఘ యువకుల లేడ్స్ టు లీడర్స్ (బాలకుల నుండి పాలకులు) కన్వెన్షన్ ఘనముగా నిర్వహించబడినది. బి.కె. పల్లిలో రిక్కీగూటం గారి ద్వారా నిర్మించబడి ఆయనచే గత సంవత్సరం ప్రతిష్టింపబడిన క్రీస్తుసంఘ ఆలయములో ఈ యువకుల కన్వెన్షన్ ఘనముగా జరిగినది. ఆ ప్రాంతములలో యున్న అనేక యువతీ యువకులు అందులో సంతోషముతో పాల్గొనిరి.

మత్తయి సువార్త నుండి కంఠస్థ వాక్యములు క్విజ్‌లు నిర్వహించబడెను. మరియు పాటలపోటీలు, బైబిలు సంబంధమైన నాటికలు వగయిరా నిర్వహించ బడెను. పాల్గొనిన ప్రతి యువతీ యువకునికి బహుమతులు ఇయ్యబడెను. రిక్కీ గారు యౌవనస్థులను ప్రోత్సహించుచు చక్కటి బైబిలు ఉపన్యాసములు చేసిరి. బి.కె.పల్లి ఏరియా నుండి సోదరులు జి.సత్తిబాబు, కె. వెంకటాపురం ఏరియా నుండి డి. బాబూరావు గారు ఈ కన్వెన్షన్‌కు సారధ్యము వహించిరి. వందలాది యువకులు హాజరై ఆత్మీయముగా బలపడిరి. రెండురోజులు గొప్ప క్రైస్తవ సహవాసమును, భౌతిక ఆనందమును ఆస్వాదించిరి.

2021 ఫిబ్రవరి 20వ తేదీ శనివారం అమలాపురంలో గ్రేస్‌లాండ్‌లో యున్న క్రీస్తుసంఘ ఆలయము పునరాలంకీకరణము (రెనొవేషన్) చేయబడిన సందర్భముగా గొప్ప సహవాస కూటము ఏర్పాటు చేయబడెను. ఇంచుమించు 50 సంవత్సరముల క్రితము అక్కడ ఆర్.సామ్యూల్ గారు, గూటం అప్పారావు గారు, గూటం పాల్ గారి ద్వారా సంఘమును స్థాపించగా అది నేటికిని దినదినాభివృద్ధి జెందుచున్నది. ఆర్.సామ్యూల్ గారు ప్రభువునందు నిద్రించినను

ఆయన కుమారులు విక్టర్, రాజారావ్ గార్లును, తదితర బంధువులును గొప్ప సువార్త పరిచర్యసాగించుచున్నారు. ఆ కూటములో సోదరులు వి. రాజు (హైదరాబాదు), యం. జాన్‌డీన్ (బిక్కవోలు), జాషువాగూటం (కాకినాడ), టి. ప్రసన్న విజయ్ కుమార్ గార్లు వాక్యపరిచర్య చేసిరి. హాజరైన వారందరికీ మంచి భోజన ఏర్పాట్లు చేయబడెను. తదుపరి వారు నిర్వహించుచున్న వృద్ధుల ఆశ్రమ వార్షికోత్సవము జరిగెను. అమలాపురంలో జరుగుచున్న దేవుని పనిని ప్రభువు దీవించును గాక!.

సత్యవాణి స్కూల్ ఆఫ్ ఇవాంజిలిజమ్ ఆన్‌లైన్‌లో నిరాటంకముగా నడుచుచున్నది. ప్రస్తుతానికి 8 వ బ్యాచ్ జరుగుచున్నది. సత్యవాక్యమును నేర్చుకొను ఆసక్తి గలవారు 9848998547కు ఫోన్ చేసి వివరములు తెలిసికొనగలరు.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2021-2023**

**సత్యవాక్కు**
పోస్టుబాక్సు - 80
కాకినాడ - 533001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేది : ప్రతీ నెల 9వ తేదీ
పోస్టు చేయు తేదీ : ప్రతీ నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్. ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ - 533004